


ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 ✦ సంచిక (Issue): 189 ✦ Published From: నంద్యాల (Nandyal) ✦ పేజీలు 2 ✦ https:www.prajarepublic.com ✦ వెల - 1/-
గురువారం 13 ఫిబ్రవరి 2025

RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepalledgudem, Kadapa, Ongole


### ప్రధాని మీకు బాగా క్లోజా..?

# మాజీ సీజేఐ సమాధానమిదే

భారత వ్యవస్థ పరిణతితో వ్యవహరిస్తుందని మాజీ సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ అన్నారు. ఓ ఇంటర్వ్యూలో భాగంగా అడిగిన ప్రశ్నకు ఈవిధంగా బదులిచ్చారు.

(రిపబ్లిక్ న్యూస్), ఫిబ్రవరి 13: గణపతి పూజ సందర్భంగా తమ ఇంటికి ప్రధాని మోదీ రావడంపై మాజీ సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ మరోసారి స్పందించారు. ప్రధాని మీకు బాగా క్లోజా..? అని ఓ ఇంటర్వ్యూలో అడిగిన ప్రశ్నకు ఆయన స్పష్టమైన సమాధానం ఇచ్చారు. తమ వ్యవస్థ పరిణతితో వ్యవహరిస్తుందని బదులిచ్చారు. "రాజ్యాంగపరంగా ఉన్నత పదవుల్లో ఉన్న ఇద్దరు వ్యక్తుల మధ్య మర్యాదపూర్వక భేటీని అతిగా చూడొద్దు. కేసుల తీర్పునకు ఇలాంటి మర్యాదలకు మధ్య సంబంధం లేదని అర్థం చేసుకొనే పరిణతి మా వ్యవస్థలో ఉంది" అని మాజీ సీజేఐ వెల్లడించారు.



ఎన్నికల బాండ్ల పథకాన్ని రద్దు చేసిన విషయాన్ని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా వచ్చిన తీర్పులను ఆయన ప్రస్తావించారు. ఆర్టికల్ 370 రద్దుకు అనుకూలంగా తీర్పు ఇవ్వడాన్ని సమర్థించుకున్నారు. రాజ్యాంగం అసలు ఉద్దేశానికి అనుగుణంగా ఆ తీర్పు ఉందన్నారు. సుప్రీంకోర్టు తీర్పుల విషయంలో రాజకీయ జోక్యం ఆరోపణలను ఆయన ఖండించారు. చట్ట ప్రకారమే రాజకీయ పార్టీల నేతలకు, కార్యకర్తలకు బెయిల్ ఇచ్చామని, గతేడాది 21,300 బెయిల్ పిటిషన్లు కొట్టేశామని గుర్తుచేశారు. మెజార్టీ వ్యక్తులకు అనుకూలంగా తీర్పులు ఉంటాయన్న ఆరోపణలను ఆయన ఖండించారు. ఈసందర్భంగా కశ్మీర్ ఎన్నికల అంశాన్ని ఉదహరించారు. "జమ్మూకశ్మీర్కు సెప్టెంబరు 30, 2024లోగా అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని సుప్రీంకోర్టు డెడ్లైన్ విధించింది. ఇప్పుడు అక్కడ ప్రజాస్వామ్యయుతంగా ఎన్నుకొన్ని ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అధికార మార్పిడి కూడా శాంతియుతంగా జరిగింది" అంటూ సమాధానమిచ్చారు. ఇదిలాఉంటే, జస్టిస్ డీవై చంద్రచూడ్ సీజేఐగా ఉన్న సమయంలో ఆయన నివాసంలో నిర్వహించిన గణపతి పూజలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాల్గొన్న విషయం తెలిసిందే. మహారాష్ట్ర సంప్రదాయ టోపీ ధరించి పూజలో పాల్గొన్న ఫొటోలను ప్రధాని సామాజిక మాధ్యమ ఖాతాలో అప్పట్లో పోస్ట్ చేయడంపై విపక్షాలు విమర్శలు గుప్పించాయి. దీనిపై గతంలో జస్టిస్ డీవై చంద్రచూడ్ మాట్లాడారు. ప్రధానమంత్రి రావడంలో తప్పులేదన్న ఆయన.. అది బహిరంగ భేటీయేనని, వ్యక్తిగత సమావేశం కాదన్నారు. అధికార విభజన అంటే న్యాయవ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థలు సమావేశం కావద్దని, చర్చించవద్దని అర్థం కాదన్నారు.

### ఫిబ్రవరి 16 నాటికి దిల్లీ సీఎం ఎంపిక..

# ఇద్దరికి డిప్యూటీ ఛాన్స్

దిల్లీ నూతన ముఖ్యమంత్రి ఎంపికను ఆదివారం నాటికి ఖరారు చేయనున్నట్లు తెలుస్తోంది. ఇద్దరు డిప్యూటీ సీఎంలను నియమించే అవకాశాలు కన్పిస్తున్నాయి.

దిల్లీ, ఫిబ్రవరి 13, (రిపబ్లిక్ న్యూస్): దేశ రాజధాని దిల్లీలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడి ఐదు రోజులైనా ఇంకా నూతన ముఖ్యమంత్రి ఎవరనే దానిపై సస్పెన్స్ కొనసాగుతూనే ఉంది. దీనిపై పార్టీ అధినాయకత్వం ముమ్మర కసరత్తు చేస్తోంది. ఈ ఆదివారం భాజపా శాసనసభా పక్ష నేతల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ భేటీలో పార్టీ జాతీయ నాయకత్వం నుంచి ఇద్దరు సీనియర్ సభ్యులు కూడా హాజరుకానున్నారు. ఈ సమావేశంలోనే తదుపరి ముఖ్యమంత్రిని ఎన్నుకోనున్నట్లు పార్టీ వర్గాలు తాజాగా వెల్లడించాయి.



ఇక, ఉప ముఖ్యమంత్రి పదవిని ఇద్దరికి ఇచ్చే అవకాశాలు కన్పిస్తున్నాయి. ప్రస్తుతం భాజపా పాలిత రాష్ట్రాలైన మధ్యప్రదేశ్, యూపీ, రాజస్థాన్లో ఇద్దరు డిప్యూటీ సీఎంలు ఉన్న సంగతి తెలిసిందే. సామాజిక సమీకరణాలకు అనుగుణంగా ఢిల్లీలోనూ అదే ఫార్ములాను అనుసరించాలని కమలదళం యోచిస్తున్నట్లు సమాచారం. మరోవైపు, 'మినీ ఇండియా'ను ప్రతిబింబించేలా కొత్త కేబినెట్ ఎంపిక ఉండనున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దిల్లీ ముఖ్యమంత్రి అభ్యర్థి రేసులో పలువురి పేర్లు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా మాజీ సీఎం కేజీవాల్ను ఓడించిన జాట్ వర్గానికి చెందిన పర్వేశ్ వర్మ ముందంజలో ఉన్నారు. ఆయనతో పాటు సతీశ్ ఉపాధ్యాయ్, విజయేందర్ గుప్తా, ఆశిష్ సూద్, పవన్ శర్మ వంటి పలువురు నేతల పేర్లు ప్రచారంలో ఉన్నాయి. పూర్వాంచల్ నేపథ్యం కలిగిన ఎమ్మెల్యే, సిక్కు లేదా మహిళను సైతం పరిగణనలోకి తీసుకొనే అవకాశం ఉండొచ్చని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం ప్రధాని మోదీ అమెరికా పర్యటనలో ఉన్నారు. ఆయన స్వదేశానికి చేరుకున్న తర్వాతే సీఎం ఎంపిక, ప్రమాణస్వీకారం ఉండనుంది. ఇటీవల జరిగిన దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో మొత్తం 70 స్థానాలకు గాను భాజపా 48 స్థానాల్లో విజయఢంకా మోగించి తన 27 ఏళ్ల కలను సాకారం చేసుకుంది. ఆప్ కేవలం 22 స్థానాలకే పరిమితం కాగా.. కాంగ్రెస్ ఖాతా తెరవలేక చతికిలపడిన విషయం తెలిసిందే.

# స్వామిమలై శ్రీ స్వామినాథ స్వామి వారిని దర్శించుకున్న పవన్ కళ్యాణ్

- షష్ఠ షణ్ముఖ క్షేత్ర యాత్రకు శ్రీకారం
- కంద షష్టి కవచ పారాయణంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి

తంజావూరు, ఫిబ్రవరి 13, (రిపబ్లిక్ న్యూస్): ఆది ప్రణవనాదం ఓం కార మంత్ర రహస్యాన్ని సృష్టికి అందించిన క్షేత్రం.. షష్ఠ షణ్ముఖ క్షేత్రాల్లో ఐదవ క్షేత్రం స్వామిమలై. అక్కడ కొలువైన శ్రీ స్వామినాథ స్వామి వారిని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దర్శించుకున్నారు.





ఆధ్యాత్మిక యాత్రలో భాగంగా గురువారం తంజావూరు సమీపంలోని స్వామిమలైని సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీ కన్నన్ గురుకల్... సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. పంచ హారతులతో హారతి ఇచ్చారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి ధ్వజస్థంభానికి మొక్కారు. స్వామినాథ స్వామికి అత్యంత ప్రీతిపాత్రమైన కంద షష్టి కవచ పారాయణంలో పాల్గొన్నారు. శ్రీ పవన్ కళ్యాణ్ గారితో పాటు ఆయన కుమారుడు శ్రీ అకీరా నందన్, తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్ట్ బోర్డు మెంబర్ శ్రీ ఆనంద్ సాయి ఈ క్షేత్రాన్ని దర్శించుకున్నారు.

### శ్రీ సుందరేశ్వరన్, మీనాక్షి అమ్మన్ దర్శనం

శ్రీ స్వామినాథ స్వామి దర్శనానంతరం ఆలయంలో వెలసిన ఆదిదంపతులు శ్రీ సుందరేశ్వరన్ స్వామి, మీనాక్షి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు పవన్ కళ్యాణ్కి డిప్యూటీ కమిషనర్ ఉమా దేవి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

# హైదరాబాద్లో గూగుల్ ఏఐ కేంద్రం.. సీఎం సమక్షంలో ఎంవోయూ

నగరంలో ఏఐ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్టు గూగుల్ ప్రకటించింది. ఈ మేరకు ఆ సంస్థ రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం చేసుకుంది.



హైదరాబాద్, ఫిబ్రవరి 13, (రిపబ్లిక్ న్యూస్):నగరంలో ఏఐ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్టు గూగుల్ ప్రకటించింది. ఈ మేరకు ఆ సంస్థ రాష్ట్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం చేసుకుంది. టీహబ్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ మంత్రి శ్రీధరాబాబు సమక్షంలో గూగుల్ ప్రతినిధులు ఎంఓయూ కుదుర్చుకున్నారు. కృత్రిమ మేధ అంకుర పరిశ్రమలకు గూగుల్ తోడ్పాటునందించనుంది. వ్యవసాయం, విద్య, రవాణారంగం, ప్రభుత్వ డిజిటల్ కార్యకలాపాలకు గూగుల్ ఏఐ కేంద్రం సహకరిస్తుందని ఆ సంస్థ ప్రతినిధులు వెల్లడించారు.

### పాతికేళ్ల ప్రస్థానం..

# ఫిబ్రవరి 19న భారాస విస్తృతస్థాయి సమావేశం

పాతికేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంటున్న వేళ రజతోత్సవ వేడుకల నిర్వహణతో పాటు పార్టీ నిర్మాణం, భవిష్యత్ కార్యాచరణపై చర్చించేందుకు భారత రాష్ట్ర సమితి సిద్ధమైంది.

హైదరాబాద్, ఫిబ్రవరి 13, (రిపబ్లిక్ న్యూస్): పాతికేళ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుంటున్న వేళ రజతోత్సవ వేడుకల నిర్వహణతో పాటు పార్టీ నిర్మాణం, భవిష్యత్ కార్యాచరణపై చర్చించేందుకు భారత రాష్ట్ర సమితి సిద్ధమైంది. ఈ మేరకు పార్టీ విస్తృతస్థాయి కార్యవర్గం ఈ నెల 19న సమావేశం కావాలని.. అధినేత కేసీఆర్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కు ఆదేశాలు జారీ చేశారు.



ఫిబ్రవరి 19న తెలంగాణభవన్లో మధ్యాహ్నం ఒంటి గంటకు సమావేశం జరగనుంది. కేసీఆర్ అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గం, జిల్లా అధ్యక్షులు, ప్రస్తుత, మాజీ ఎంపీలు.. ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ ఛైర్మన్లు, జడ్పీ ఛైర్మన్లు, డీసీసీబీ, డీసీఎంఎస్ అధ్యక్షులు, పార్టీ నియోజకవర్గ ఇన్ఛార్జిలు పాల్గొననున్నారు. "రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, ప్రభుత్వ వైఫల్యాల మీద ప్రధానంగా చర్చిస్తాం. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు అనుగుణంగా భారాస శ్రేణులు చేపట్టాల్సిన కార్యాచరణపై సమగ్ర చర్చ ఉంటుంది. ప్రభుత్వం ఇచ్చిన హామీల సాధన, హక్కులను కాపాడుకునే దిశగా రాష్ట్ర ప్రజలను చైతన్యం చేసేందుకు పార్టీ నాయకత్వం, కార్యకర్తలు, శ్రేణులు అనుసరించాల్సిన వ్యూహాలు, విధానాలపై సమావేశంలో చర్చిస్తాం"అని కేటీఆర్ తెలిపారు.

## రూ.2కోట్ల విలువైన బంగారం, వజ్రాలు చోరీ.. ముగ్గురి అరెస్ట్

నారాయణగూడ పీఎస్ పరిధిలో చోరీ కేసును పోలీసులు ఛేదించారు. చోరీకి పాల్పడిన ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు.



హైదరాబాద్, ఫిబ్రవరి 13, (రిపబ్లిక్ న్యూస్): నారాయణగూడ పీఎస్ పరిధిలో చోరీ కేసును పోలీసులు ఛేదించారు. చోరీకి పాల్పడిన ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు వివరాలను కమిషనర్ సీవీ ఆనంద్ మీడియాకు వివరించారు. "హిమాయత్ నగర్ మినర్వా హోటల్ గల్లీలోని ఓ ఇంట్లోకి చొరబడిన నిందితులు సుమారు రూ.2కోట్ల విలువైన బంగారం, వజ్రాలు చోరీ చేశారు. ఇంటి యజమాని అభయ్ కెడియా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నాం. వీరంతా కరడుగట్టిన నేరస్థులు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది" అని సీవీ ఆనంద్ చెప్పారు.

# రూ.41 కోట్లు పలికిన ఒంగోలు జాతి గిత్త.. సీఎం చంద్రబాబు

ప్రపంచ వేదికపై ఒంగోలు గిత్త తన సత్తా చాటిందని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు.




అమరావతి, ఫిబ్రవరి 13, (రిపబ్లిక్ న్యూస్): ప్రపంచ వేదికపై ఒంగోలు గిత్త తన సత్తా చాటిందని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ మార్కెట్లో ఒంగోలు గిత్త రూ.41కోట్లు పలకడం శుభపరిణామమన్నారు. రాష్ట్ర పశుసంవర్ధక వారసత్వం ప్రపంచానికి చాటిందని పేర్కొన్నారు. ఒంగోలు గిత్తలు ఉన్నత జన్యువులు, బలానికి ప్రసిద్ధి చెందాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ జాతిని పరిరక్షిస్తూ పాడి రైతులను ఆదుకోవడానికి కృషి చేస్తోందని వెల్లడించారు. మిలమిల మెరిసే తెల్లటి శరీరం.. చలి, వేడిని తట్టుకునే శరీరతత్వం.. చూపరులను ఆకట్టుకునే మూపురం... రంకెల్లో రాజసం.. ఒంగోలు జాతి పశువుల పేరెత్తగానే జంతు ప్రేమికుల కళ్లెదుట కదలాడే దృశ్యాలివి. అటువంటి వాటికి పుట్టినిల్లు ప్రకాశం జిల్లా. బ్రెజిల్లో ఇటీవల నిర్వహించిన వేలంలో ఒంగోలు జాతి గిత్త (వియాటినా-19) ఏకంగా రూ.41 కోట్ల ధర పలికింది.

## బర్డ్ ఫ్లూపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదు: మంత్రి అచ్చెన్నాయుడు

బర్డ్ ఫ్లూపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

అమరావతి, ఫిబ్రవరి 13, (రిపబ్లిక్ న్యూస్): బర్డ్ ఫ్లూపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. ఉడికించిన చికెన్, గుడ్లు తింటే ప్రమాదం ఏమీ లేదన్నారు. బర్డ్ ఫ్లూపై నిత్యం సమీక్షిస్తున్నట్టు చెప్పారు. సచివాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు.




"బర్డఫూపై కొన్ని పత్రికలు, సోషల్ మీడియా ప్రజల్లో భయాన్ని సృష్టిస్తున్నాయి. ప్రజలను భయాందోళనకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవు. ఉంగుటూరులో ఒకరికి బర్డా సోకిందని ఓ పత్రికలో రాశారు. ఇలాంటి తప్పుడు వార్తల కారణంగా ప్రజలు భయాందోళనకు గురవుతారు. బర్డ్రీపై శాస్త్రవేత్తలు, కేంద్రంతో సీఎం చంద్రబాబు చర్చించారు. కేంద్రం, శాస్త్రవేత్తలు ఇచ్చిన మార్గదర్శకాలను పాటిస్తున్నాం" అని తెలిపారు.

## వంశీ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నా జగన్ ఎందుకు వారించలేదు? :ఎమ్మెల్యే యార్లగడ్డ

గతంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని వైకాపా నేతలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారని తెదేపా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు.

అమరావతి, ఫిబ్రవరి 13, (రిపబ్లిక్ న్యూస్): గతంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని వైకాపా నేతలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారని తెదేపా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అరెస్ట్ నేపథ్యంలో తెదేపా కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడారు. "నోటికొచ్చినట్లు మాట్లాడితే ఊరుకుంటారా.. ఏనాడైనా పాపం పండుతుంది. గ్రీవెన్స్లో వచ్చే సమస్యల్లో అధిక శాతం భూకబ్జాలే. సభ్య సమాజం తలదించుకునేలా వల్లభనేని వంశీ మాట్లాడారు. జగన్కు అలాంటివారే నచ్చుతారు. వంశీ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నా ఎందుకు వారించలేదు? ఇకనైనా జగన్ తన వైఖరి మార్చుకోవాలి. వైకాపా నేతలు గన్నవరంలో భూములు కబ్జా చేశారు. ఎవరైనా చట్టానికి అనుగుణంగా నడుచుకోవాలి" అని వెంకట్రావు అన్నారు.




printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్పెషల్




## చరిత్రలో నేటి ప్రత్యేకత

- 2011: ప్రపంచ రేడియో దినోత్సవం
- 1879: స్వాతంత్ర సమరయోధురాలు, భారత కోకిల సరోజినీ నాయుడు జననం (మ.1949) (చిత్రంలో)
- 1913: పండితుడు గట్టి లక్ష్మీనరసింహ శాస్త్రి జననం (మ.1997).
- 1911: ఉర్దూ కవి ఫైజ్ అహ్మద్ ఫైజ్ జననం (మ.1984).
- 1914: కమ్యూనిస్టు నాయకుడు మాదాల నారాయణస్వామి జననం (మ.2013).
- 1930: ఆర్యసమాజ్ నాయకుడు నూతి శంకరరావు జననం.
- 1931: భారతదేశ రాజధానిగా కొత్త ఢిల్లీని ప్రారంభించారు.
- 1971: మొట్టమొదటి తెలుగు సినిమా కథానాయకి సురభి కమలాబాయి మరణం (జ.1907).
- 1974: బ్రిటీష్ గాయకుడు-గేయరచయిత రాబీ విలియమ్స్ జననం.


రేడియో


కోకిల ... నాయుడు


గట్టి లక్ష్మీనరసింహ శాస్త్రి



ఫైజ్ అహ్మద్ ఫైజ్


మాదాల నారాయణస్వామి


నూతి శంకరరావు



భారతదేశ పార్లమెంట్


సురభి


రాబీ విలియమ్స్

# 'ఛావా' మ్యూజిక్‌లో అదే ప్రత్యేకం.. : ఏఆర్ రెహమాన్

'ఛావా' సినిమా పాటలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని సంగీత దర్శకుడు ఏ ఆర్ రెహమాన్ అన్నారు.



విక్కీ కౌశల్, రష్మిక ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'ఛావా' ఫిబ్రవరి 14న ప్రేక్షకుల ముందుకురానుంది. ఇప్పటికే చిత్రబృందం వరుస ఇంటర్వ్యూలతో సినిమాపై ఆసక్తిని పెంచింది. తాజాగా సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ ఈ సినిమా గురించి మాట్లాడారు. సంగీతం మనుషులపై శాశ్వత ప్రభావాన్ని చూపుతుందన్నారు. ఛావా గురించి రెహమాన్ మాట్లాడుతూ.. "సంగీతానికి కాలపరిమితి ఉండదు. ఎప్పటి పాటలైనా కొత్తగానే ఉంటాయి. 'ఛావా'లోని పాటలు కూడా ఎప్పటికీ గుర్తుండిపోతాయి. ఈ సినిమాలో ఎన్నో భావోద్వేగాలున్నాయి. పాటలు కూడా వాటికి అనుగుణంగానే ఉంటాయి. ఇందులో సున్నితమైన అంశాలు ఉన్నాయి. అలాగే ఆధ్యాత్మికమైన సన్నివేశాలున్నాయి. వీటితో పాటు భయంకరమైన యుద్ధ సన్నివేశాలు కూడా ఉన్నాయి. ఇన్ని రకాల భావోద్వేగాలుండడమే ఈ సినిమా ప్రత్యేకం. ఇది కథ సారాంశాన్ని ప్రేక్షకులకు వివరిస్తుంది" అని చెప్పారు. మరోవైపు ఈ సినిమా ప్రీ సేల్ బుకింగ్స్ హవా చూపిస్తోంది. 11 వేలకు పైగా థియేటర్లలో ఈ సినిమా విడుదల కానుంది. ఈనేపథ్యంలో ప్రీ సేల్ బుకింగ్స్ ఓపెన్ చేయగా ఇప్పటివరకూ 3 లక్షలకు పైగా టికెట్స్ అమ్ముడైనట్లు చిత్రబృందం తెలిపింది. రూ.10 కోట్లు కలెక్షన్లు వచ్చినట్లు ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి. దీంతో ఈ సినిమా రిలీజ్ తర్వాత భారీ వసూళ్లు చేయొచ్చని ఫ్యాన్స్ అభిప్రాయపడుతున్నారు. శంభాజీ మహారాజ్ విక్కీ కౌశల్, ఆయన భార్య యేసుబాయి పాత్రలో రష్మిక నటించారు. ఫిబ్రవరి 14న సినిమా ప్రేక్షకుల ముందుకురానున్న సందర్భంగా చిత్రబృందం ఇటీవల ట్రైలర్ విడుదల చేసింది. హోలీ వేడుకల్లో భాగంగా శంభాజీ మహారాజ్ ఆనందంతో డ్యాన్స్ చేసినట్లు ఇందులో చూపించారు. ఆ సన్నివేశంపై విమర్శలు రావడంతో దాన్ని సినిమాలో నుంచి తొలగించారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

# పవన్ కల్యాణ్ నుంచి ఆ లక్షణం నేర్చుకోవాలి: నిధి అగర్వాల్

తన అప్ కమింగ్ సినిమాల గురించి నిధి అగర్వాల్ పంచుకున్నారు. పవన్ కల్యాణ్, ప్రభాస్లు తనకు ఎంతో సపోర్ట్ చేస్తారని చెప్పారు.



'హరిహర వీరమల్లు', 'ది రాజాసాబ్ తో ఈ ఏడాది ప్రేక్షకులకు వినోదాన్ని అందించనున్నారు నటి నిధి అగర్వాల్. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె తన అప్కమింగ్ సినిమాల గురించి మాట్లాడారు. పవన్కల్యాణ్, ప్రభాస్లతో వర్క్ చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. 2022లో విరామం తీసుకోవడానికి కారణాన్ని నిధి వివరించారు. "నేను స్టార్ కిడ్ని కాదు. అలాగే నాకు సినిమా నేపథ్యం కూడా లేదు. నేను నటిగా మొదటిస్థానంలో ఉండడమే పెద్ద విషయం. సినిమాల్లో అవకాశాలు రావడమే నాకు విజయంతో సమానం. ఎక్కువ సినిమాలు చేయాలని అందరికీ ఉంటుంది. కానీ, నేను మాత్రం నమ్మకం ఉన్న కథలనే ఎంచుకుంటాను. అలాంటివాటిపై మాత్రమే దృష్టి పెడతాను. నేనేం హీరోను కాదు.. వరుసగా కమర్షియల్ సినిమాలు చేయడానికి. ఒకవేళ నేను వరుస సినిమాలు చేసినా నన్ను అలాంటి స్క్రిప్ట్ ఎంచుకున్నందుకు విమర్శిస్తారు. అందుకే గొప్ప కథలను మాత్రమే ఎంచుకుంటున్నాను" అని చెప్పారు. తన అప్కమింగ్ సినిమాల గురించి మాట్లాడిన నిధి.. "హరిహర వీరమల్లు'లో నా పాత్ర ఇప్పటివరకు నేను చేసిన వాటిల్లో అత్యుత్తమమైనది. ఆ పాత్ర కోసం గుర్రపు స్వారీ, క్లాసికల్ డ్యాన్స్లో ప్రత్యేక శిక్షణ తీసుకున్నా. కథక్ నేర్చుకున్నాను. నా కల నిజమైంది. అదృష్టవంతురాలిననిపించింది. అలాగే హారర్ సినిమాలంటే గతంలో భయం ఉండేది. అందుకే 'ది రాజా సాబ్' చేయాలనుకున్నాను. ఆ చిత్ర బృందమంతా ఫన్నీగా ఉంటుంది. సెట్లో స్క్రిప్ట్ చదువుతున్నప్పుడు కూడా అందరం నవ్వుతూనే ఉన్నాం" అని అన్నారు. పవన్ కల్యాణ్, ప్రభాస్ లు తనను ఎంతో ప్రోత్సహించారని నిధి తెలిపారు. "పవన్ సెట్స్లో ఉన్నప్పుడు ఎంతో ఏకాగ్రతతో ఉంటారు. యాక్షన్ చెప్పగానే పూర్తిగా లీనమవుతారు. చుట్టూ ఏం జరుగుతున్నా పట్టించుకోరు. తన సన్నివేశంపై మాత్రమే దృష్టిపెడతారు. ఈ లక్షణాన్ని నేను కూడా అలవాటు చేసుకోవాలి. ఇక ప్రభాస్ ఎప్పుడూ ఫన్నీగా ఉంటారు. ఈ రెండు సినిమాలు ప్రేక్షకుల ముందుకు ఎప్పుడు వస్తాయా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నా" అని చెప్పారు.

రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

### ఇదేమీ గోల్ఫ్ టూర్ కాదు..

# క్రికెట్ పర్యటన: ఇంగ్లండ్ పై కెవిన్ పీటర్సన్ ఆగ్రహం

క్రికెట్ ప్రాక్టీస్ చేయకుండా... ఉపఖండ పిచ్లపై ఎలా ఆడదామని వచ్చారంటూ ఇంగ్లండ్ పై ఆ జట్టు మాజీ కెప్టెన్ కెవిన్ పీటర్సన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డాడు.



భారత పర్యటనలో రెండు సిరీస్ ను ఇంగ్లండ్ కోల్పోయింది. తొలుత టీ20 సిరీస్ ను 4-1 తేడాతో చేజార్చుకోగా.. వన్డే సిరీస్ను 3-0 తేడాతో కోల్పోయింది. ఛాంపియన్స్ ట్రోఫీకి ముంగిట తమ జట్టుకు ఎదురైన పరాభవంపై మాజీ కెప్టెన్ కెవిన్ పీటర్సన్ అసహనం వ్యక్తం చేశాడు. తాజాగా మూడో వన్డేలోనూ 142 పరుగుల తేడాతో భారత్ చేతిలో ఇంగ్లండు పరాభవం ఎదురైంది. ఈ సందర్భంగా టీమ్ ఇండియా మాజీ కోచ్ రవిశాస్త్రి చేసిన 'ప్రాక్టీస్ సెషన్' వ్యాఖ్యలపై పీటర్సన్ స్పందించాడు. కేవలం ఒకేఒక్క ప్రాక్టీస్ సెషన్లో ఇంగ్లండ్ పాల్గొందనే వార్తలు వచ్చాయి. "నేను, రవిశాస్త్రి మ్యాచ్ గురించి మాట్లాడుకుంటూ ఉన్నాం. గత వారం కనీసం ఒక్క ప్రాక్టీస్ సెషన్లోనూ ఇంగ్లండ్ ప్లేయర్లు పాల్గొనలేదని తెలిసి ఆశ్చర్యపోయా. నాగ్పూర వేదికగా జరిగిన మొదటి వన్డే ముందు కూడా ప్రాక్టీస్ చేయలేదట. కేవలం జోరూట్ మాత్రమే నెట్స్కు వచ్చాడని తెలిసింది. అలాంటప్పుడు భారత పర్యటనకు మీరు రావొద్దు. ఇలా అన్నందుకు క్షమించాలి. ఎందుకంటే ఉపఖండం పిచ్లపై ఆడాలంటే సాధన చాలా అవసరం. లేదు మేం ఇలానే పొరపాట్లు చేస్తూ ఉంటాం.. ప్రాక్టీస్ సెషన్కు వెళ్లమని అనుకుంటే ఆగిపోండి. క్రీడల్లో మంచి ప్రాక్టీస్ లేకపోతే అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వడం చాలా కష్టం. టీ20 సిరీస్ను కోల్పోయినా సరే మెరుగ్గా ఆడాలనే లక్ష్యం లేకపోతే ఎలా?. గోల్ఫ్ ఆడేందుకు ఆసక్తి చూపించిన ప్లేయర్లు క్రికెట్ను ప్రాక్టీస్ చేయడంపై దృష్టిసారించలేకపోయారు. మీరు దానిని ఆస్వాదించారు. కానీ, మ్యాచ్లు గెలిచేటప్పుడు అవన్నీ చేస్తే బాగుండేది. కానీ, ఓటములను చవిచూస్తూనే ఆడారంటే ఏమనుకోవాలి. ఇదేమీ గోల్ఫ్ టూర్ కాదుగా.. క్రికెట్ పర్యటన కదా. మీరు భారత పిచ్ పరిస్థితులకు మర్యాద ఇవ్వలేదు. ఇక్కడ ఆడటం తేలికైన విషయం కాదు" అని కెవిన్ వ్యాఖ్యానించాడు.

## ఆరోగ్యం

# కొంతమందికి ఏం తిన్నా ఆహారం జీర్ణమవ్వదు. దీంతో గ్యాస్, మలబద్ధకం వంటి సమస్యలు వస్తాయి. వీటిని నేచురల్‌గానే ఎలా తగ్గించుకోవాలో తెలుసుకోండి.

కొన్నిసార్లు ఊరికే అసిడిటీ వెంటాడుతుంది. ఏం తిన్నా జీర్ణమవ్వదు. దీంతో తినగానే కడుపు నిండుగా అనిపించడం, త్రేన్పులు రావడం, మలబద్ధకం, గ్యాస్‌గా అనిపించడం, ఇబ్బందిగా అనిపించడం వంటివి ఉంటాయి.

దీంతో రెగ్యులర్ వర్క్ చేసుకోలేం. అలాంటప్పుడు చాలా మంది కూడా సమస్యని వెంటనే తగ్గించేందుకు రకరకాల పౌడర్స్ నీటిలో కలిపి తాగడం, సిరప్స్, ట్యాబ్లెట్స్ వాడడం వంటివి చేస్తుంటారు. వీటి వల్ల సమస్య ఏ మాత్రం తగ్గదు. అందుకోసం ఏం చేయాలంటే


### గ్యాస్ పెరిగితే



కడుపులో గ్యాస్ పెరిగితే జీర్ణ వ్యవస్థ అస్తవ్యస్థమవుతుంది. దీంతో కడుపునొప్పి వస్తుంది. ఏదో ఒత్తిడిగా ఇబ్బందిగా ఉంటుంది. మన కడుపులో ఎక్కువగా సాలిడ్స్, లిక్విడ్స్ లేదా గ్యాస్ ఎక్కువగా ఉంటే ఈ సమస్య వస్తుంది. చాలా మంది ఈ సమస్యతో ఎక్కువమంది బాధపడతారు. దీనికి ఇంట్లోనే చెక్ పెట్టొచ్చు.



### కావాల్సిన పదార్థాలు



1 టీ స్పూన్ సీలియం హస్క్(ఇసబ్‌గోల్) ఆయుర్వేద షాపుల్లో, ఆన్‌లైన్‌లో దొరుకుతుంది.

1 గ్లాసు నీరు(200-250 మి.లీ)

2 టేబుల్ స్పూన్ల ఆపిల్ సైడర్ వెనిగర్

### ఎలా ప్రిపేర్ చేయాలి



ముందుగా ఓ గ్లాసు నీటిలో సీలియం హస్క్, ఆపిల్ సైడర్ వెనిగర్ కలిపాలి. బాగా కలపండి. తర్వాత డ్రింక్ తయారైనట్లే. దీనిని తాగండి.మీకు రుచి నచ్చట్లేదనిపిస్తే రెండు స్పూన్ల ఆపిల్ సైడర్ వెనిగర్ బదులు ఒక స్పూన్ ఆపిల్ సైడర్ వెనిగర్ కలపాలి

### ఎప్పుడు తాగాలి



ఇలా తయారైన డ్రింక్‌ని తినడానికి ముందుగా 20, 30 నిమిషాల ముందు తీసుకోవాలి. రెగ్యులర్‌గా తీసుకుంటే మంచి రిజల్ట్స్ ఉంటాయి. ఇక ఇందులో కలిపే ఆపిల్ సైడర్ వెనిగర్ కూడా మదర్ కల్చర్‌ది అయితేనే బాగా వర్కౌట్ అవుతుంది. మదర్ కల్చర్ ఆపిల్ సైడర్ వెనిగర్ అయితే కడుపులో మంచి బ్యాక్టీరియాని పెంచుతుంది.


### ఎలా పనిచేస్తుంది



ఈ డ్రింక్ తాగితే బ్లోటింగ్ తగ్గుతుంది. కడుపులో గ్యాస్ దూరమవుతుంది. తిన్న ఆహారం సరిగా జీర్ణమవుతుంది. ఈ డ్రింక్ గట్ హెల్త్‌కి చాలా మంచిది. రెగ్యులర్‌గా రోజుకి రెండు సార్లు తాగడం మంచిది. కావాలనుకుంటే కొద్దిగా దాల్చిన చెక్క పొడి కలపాలి. దీని వల్ల బ్లడ్ షుగర్ లెవల్స్ కూడా తగ్గుతాయి.



### ముఖ్యంగా



ఇది నేచురల్‌గా తయారుచేసిన డ్రింకే అయినప్పటికీ.. అందరికీ పడకపోవచ్చు. కారణం అందరి శరీరతత్వాలు డిఫరెంట్‌గా ఉంటాయి. కాబట్టి, తాగినప్పుడు మీకు ఏదైనా ఇబ్బందిగా ఉంటే రెగ్యులర్‌గా కాకుండా వారానికి రెండు సార్లు తాగడం అలవాటు చేసుకోండి. గ్యాస్, అసిడిటీ, మలబద్ధకం నుంచి రిలీఫ్ ఉంటుంది.